సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


పేజీలు: 10+8 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 195

శనివారం 5-10-2024



'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'



మూసీ నీటి విడుదల

మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరగడంతో మూడు గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. 2లో



శుభకార్యానికి వెళ్లి వస్తూ..

శుభకార్యానికి వెళ్లి వస్తుండగా కారు బోల్తా పడి ఒకరు మృతి చెందారు. 2లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

దసరాకైనా ఉంటుందా!

- దసరాలోపు కేబినెట్ విస్తరణ అంటూ జోరుగా చర్చ
- రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఖాయమంటున్న పార్టీ వర్గాలు
- విస్తరణ వార్తలొచ్చిన ప్రతీసారి తెర మీదకు మునుగోడు ఎమ్మెల్యే పేరు
- ఎస్టీ కోటాలో బాలునాయక్‌కు అవకాశం దక్కవచ్చంటూ చర్చ



రాజగోపాల్‌రెడ్డి



బాలునాయక్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: దసరాకు మంత్రివర్గ విస్తరణ ఉంటుందని చర్చ జరుగుతున్న నేపథ్యంలో జిల్లా నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఖాయమని ఆయన అనుచరులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ మంత్రివర్గ విస్తరణ జరుగుతుందన్న చర్చ బయటకు రావడంతో రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి వస్తుందన్న ప్రచారం జోరుగా సాగింది. అప్పుడు విస్తరణ జరగలేదు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఢిల్లీ వెళ్లిన సందర్భంలోనూ మంత్రివర్గ విస్తరణపైనే అధిష్టానంతో చర్చించారని వార్తలు వచ్చాయి. అప్పటికప్పుడు నిర్ణయం వెలువడకపోయినా దసరాకు ముందు మంత్రివర్గ విస్తరణ ఉంటుందని కాంగ్రెస్ వర్గాల్లో ఊగాహానాలు జోరందుకున్నాయి. దీంతో మంత్రి వర్గంలో రాజగోపాల్‌రెడ్డికి బెర్త్ ఖాయమనే చర్చ మళ్లీ మొదలైంది.

ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి..

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి మంత్రి పదవి వస్తుందని భావిస్తూ వస్తున్నారు. కానీ, మొదట్లో ఉమ్మడి జిల్లా నుంచి తన సోదరుడైన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మంత్రి పదవులు వచ్చాయి. ఆ తర్వాత మంత్రి వర్గ విస్తరణలో రాజగోపాల్‌రెడ్డికి తప్పకుండా అవకాశం దక్కుతుందని జోరుగా చర్చ సాగింది. అయితే పది నెలలు అవుతున్నా మంత్రివర్గ విస్తరణ జరగనే లేదు. మంత్రివర్గ విస్తరణ అంశం తెరపైకి వచ్చిన ప్రతిసారి రాజగోపాల్‌రెడ్డి పేరు ప్రస్తావనకు వస్తోంది.

ఎంపీ ఎన్నికల సందర్భంలో అధిష్టానం హామీ

పార్లమెంట్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఢిల్లీ, రాష్ట్ర అధిష్టానం తనకు మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చినట్లుగా రాజగోపాల్‌రెడ్డి పలు సందర్భాల్లో చెప్పుకొచ్చారు. రాహుల్‌గాంధీ ప్రధాని కావాలంటే రాష్ట్రం నుంచి ఎక్కువ మంది ఎంపీలను గెలిపించాలని అధిష్టానం, రాష్ట్ర పార్టీ నేతలు, ముఖ్యమంత్రి కలిసి నిర్ణయించారు. అభ్యర్థుల ఎంపికతోపాటు వారి గెలుపు బాధ్యతలను జిల్లాల్లోని ముఖ్య నేతలకు అప్పగించారు. అందులో భాగంగా భువనగిరి ఎంపీగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించే బాధ్యతను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి అప్పగించారు. ఆ సమయంలో ఎంపీని గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామని అధిష్టానం హామీ ఇచ్చినట్లుగా చర్చ జరిగింది. మొత్తానికి భువనగిరి ఎంపీగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని దగ్గరుండీ గెలిపించారు. అప్పటి నుంచి మంత్రి పదవి కచ్చితంగా వస్తుందని రాజగోపాల్‌రెడ్డి భావించినా ఇంతవరకు మంత్రివర్గ విస్తరణ మాత్రం జరగలేదు. అయితే, దసరాకు మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో అధిష్టానం హామీ మేరకు రాజగోపాల్‌రెడ్డికి బెర్త్ దక్కుతుందా అన్న చర్చ మళ్లీ జోరందుకుంది.

ఎస్టీ కోటాలో బాలునాయక్‌కు!

ఎస్టీ లంబాడా కోటాలో దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్‌కు మంత్రి పదవి వస్తుందని చర్చ సాగుతోంది. రాష్ట్రంలో ఆదివాసీ గిరిజన కోటాలో సీతక్కకు అధిష్టానం అవకాశం కల్పించింది. లంబాడా కోటాలో మరొక మంత్రి పదవి ఇస్తారన్న చర్చ సాగుతోంది.

హోం మంత్రి పదవి ఇవ్వాలని..!

ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇటు ప్రతిపక్ష, అటు అధికార పక్షాల మధ్య పోటాపోటీగా అసెంబ్లీలో చర్చలు జరిగాయి. ఆ తర్వాత ప్రభుత్వ వేదికలతోపాటు రాజకీయ వేదికల్లోనూ పెద్ద ఎత్తున అధికార, ప్రతిపక్షాలు పోటా పోటీగా విమర్శలు చేసుకున్నాయి. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని అధికార పక్షం, పాలన చేత కాక గత ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తుందని ప్రతిపక్షం విమర్శలు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే తనకు హోంమంత్రి పదవి ఇవ్వాలని, తాను హోం మంత్రి అయితేనే కేసీఆర్‌ను సమర్థంగా ఎదుర్కొంటానని రాజగోపాల్‌రెడ్డి పలు సమావేశాల్లోనూ చెప్పుకొచ్చారు.

న్యూస్‌రీల్

బీఈడీ ఫలితాలు విడుదల

నల్లగొండ రూరల్ : మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ సెమిస్టర్ ఫలితాలను ఎంజీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఉపేందర్ రెడ్డి, అడిషనల్ కంట్రోలర్ లక్ష్మీప్రభ శుక్రవారం విడుదల చేశారు. నాలుగో సెమిస్టర్‌లో 92.6 శాతం, మూడో సెమిస్టర్‌లో 79.30 శాతం, రెండో సెమిస్టర్‌లో 84.96 శాతం, మొదటి సెమిస్టర్‌లో 77.7 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఫలితాల కోసం యూనివర్సిటీ వెబ్ సైట్‌ను చూడాలని సూచించారు.

నేడు మంత్రి పొంగులేటి రాక



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ, తిరుమలగిరి(నాగార్జునసాగర్) : రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాలు, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం తిరుమలగిరి సాగర్ మండలంలో పర్యటించనున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన ఆర్ఓఆర్ – 2024 చట్టాన్ని తీసుకొస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తిరుమలగిరి(సాగర్) మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. దీంతో నెలన్నర రోజులుగా మండలంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ స్థాయిలో భూ సర్వే కొనసాగుతోంది. ఇప్పటి వరకు భూ సర్వే జరిగిన తీరు, సర్వేలో ఎదురవుతున్న ఇబ్బందులు తదితర వివరాలను మంత్రి పొంగులేటి తెలుసుకోనున్నారు. నెలికల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అధికారులు, రైతులతో ముఖాముఖి మాట్లాడనున్నారు. అనంతరం మధ్యాహ్నం 1.30 గంటలకు నాగార్జున సాగర్ వద్ద ఉన్న విజయవిహార్‌కు చేరుకొని రెవెన్యూ అధికారులతో ధరణిపై సమీక్షించనున్నారు. మంత్రి పర్యటన ఏర్పాట్లను శుక్రవారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్‌ను పరిశీలించారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

నల్లగొండ టూటౌన్ : ఖమ్మం, మెదక్ జిల్లాల్లో ఈనెల 5 నుంచి 7వ తేదీ వరకు జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 బాల, బాలికల ఫుట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు నల్లగొండలోని ఛత్రపతి శివాజీ ఫుట్‌బాల్ అసోసియేషన్‌కు చెందిన ఆరుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైనవారిలో రాచూరి వెంకటసాయి, కొక్కు యశ్వంత్, అన్వర్, అప్పల మణిరామ్, కురిమిళ్ల హర్షవేదార్య, అప్పల సోని ఉన్నారు. ఈ క్రీడాకారులకు కేఎస్ బయోసైన్సెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో టీషర్టులు పంపిణీ చేశారు.

'మధ్యాహ్న' బిల్లులు విడుదల

నల్లగొండ : మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన బిల్లులను విద్యా శాఖ విడుదల చేసింది. బియ్యం కొనుగోలు, రవాణా, ఆఫీస్ నిర్వహణ, ఎంఐఎస్ కోఆర్డినేటర్ల జీతాలకు ఈ డబ్బులు చెల్లించనుంది. 2024–25 విద్యా సంవత్సరంలో ఐదు నెలలకు సంబంధించి రూ.12,10,293 విడుదల చేసింది. వీటిలో ఎంఐఎస్ కోఆర్డినేటర్లకు రూ.60,750, పౌర సరఫరాల శాఖ ఇచ్చే సన్న బియ్యానికి రూ.8,24,775, బియ్యం రవాణా చార్జీల రూ.3,05,368, ఆఫీస్‌లో పనిచేసే డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఇతర చెల్లింపులకు రూ.20 వేలు కేటాయించింది.

హాలియా మార్కెట్ చైర్మన్‌గా చంద్రశేఖర్‌రెడ్డి



తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్



కలసాని చంద్రశేఖర్, వైస్ చైర్మన్

హాలియా : హాలియా వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం ఖరారైంది. 18 మంది సభ్యులతో కూడిన కమిటీని నియమిస్తూ వ్యవసాయ, సహకారశాఖ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు ఈనెల 3న ఉత్తర్వులు జారీ చేశారు. హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ పెద్దవూర మండలం చలకుర్తి గ్రామానికి చెందిన తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా తిరుమలగిరి (సాగర్) మండలంలోని బోయగూడెం గ్రామానికి చెందిన కలసాని చంద్రశేఖర్, సభ్యులుగా గుండెబోయిన లక్ష్మయ్య, రావులపాటి శంకరయ్య, ఎస్‌కె.గౌస్ బాబా, సజ్జల రఘుపతిరెడ్డి, మొసంగి వెంకటేశ్వర్లు, గోర్ల ఇద్దయ్య, ఆంగోతు పాండునాయక్, శాగం మంగమ్మ, రమావత్ రాములు, ఊర వెంకన్న, చిట్టిపోలు యశ్వంత్, వీరమల్ల శ్రీనివాసులు నియమితులయ్యారు. వీరిని పలువురు అభినందించారు.

● జలాభిషేకం



కట్టంగూర్ మండల కేంద్రంలో కాటమయ్య ఉత్సవాల సందర్భంగా కంఠమహేశ్వరస్వామి, ఎల్లమ్మ, మైసమ్మ దేవతలకు జలాభిషేకం చేసేందుకు వెళ్తున్న గౌడ కులస్తులు

ధాన్యం సేకరణలో తప్పులకు ఆస్కారం ఉండొద్దు

- కలెక్టర్ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ : ధాన్యం సేకరణలో తప్పులకు ఆస్కారం ఉండొద్దని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. 2024– 25 వానాకాలం ధాన్యం సేకరణపై శుక్రవారం మండల స్థాయి బృందాలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా పోలీస్ అధికారులు నిఘా ఏర్పాటు చేయాలని, చెక్‌పోస్టుల వద్ద తనిఖీలను కట్టుదిట్టం చేయాలన్నారు. ప్రభుత్వం సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించడంతో.. రాష్ట్రంలోనే నల్లగొండ జిల్లాలో అత్యధికంగా వరి పంట మార్కెట్‌కు వస్తుందన్నారు. ధాన్యం కొనుగోలులో అన్ని శాఖలను భాగస్వామ్యం చేస్తున్నామని, అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. సన్నధాన్యానికి, దొడ్డు ధాన్యానికి వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. సన్నధాన్యం బస్తాల పై 'ఎస్' అని ఎరుపు రంగుతో రాయాలని సూచించారు. ఏరోజు కొనుగోలు చేసిన ధాన్యాన్ని అదేరోజే మిల్లులకు పంపించాలని, లారీల కొరత లేకుండా చూడాలన్నారు. ప్రతి కేంద్రానికి 50 శాతం గన్నీ బ్యాగులను ముందే సిద్ధం చేసుకోవాలన్నారు. ధాన్యాన్ని అమ్మే రైతులు కొనుగోలు కేంద్రాల్లో తప్పనిసరిగా పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంటు జిరాక్స్‌లను సెంటర్ ఇన్‌చార్జి ఇవ్వాలన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యాన్ని నియంత్రించేందుకు వాడపల్లి, విజయపురి వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ హరీష్, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, డీఆర్డీఓ శేఖర్‌రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి ఛాయాదేవి, జిల్లా సహకారశాఖ అధికారి పత్యానాయక్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిని సందర్శించాలి



ఉద్యోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

నల్లగొండ టూటౌన్ : పైలెట్ పద్ధతిలో చేపడుతున్న కుటుంబ డిజిటల్ కార్డు సర్వేలో భాగంగా ప్రతి ఇంటిని, కుటుంబాన్ని సందర్శించాలని కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత సర్వే బృందాలను ఆదేశించారు. గురువారం నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు కేశరాజుపల్లి, హ్యాపీహోమ్స్‌లో సర్వేను ఆకస్మిక తనిఖీ చేశారు. కేశరాజుపల్లిలో ఎన్ని కుటుంబాలు, ఎన్ని గృహాలు ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బేస్ డేటా ఆధారంగా సర్వే నిర్వహించాలని, సర్వేలో ప్రతి ఇంటిని సందర్శించాలన్నారు. ఫొటోలు తారుమారు కాకుండా సరి చూసుకోవాలని, కుటుంబాల వివరాల సేకరణ సందర్భంగా కొత్త కుటుంబాల నమోదు, ఎవరైన వివాహం అయి వెళ్లిపోయిన వారి వివరాలను తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్డీఓ శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, ఈఈ రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవంతో జీవించడం మహిళల హక్కు

- అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు విమలక్క



బతుకమ్మలతో విమలక్క, లక్ష్మి తదితరులు

శాలిగౌరారం: మహిళలపై పెరుగుతున్న అత్యాచారాలను నిరసిస్తూ స్త్రీలు గౌరవంగా జీవించే హక్కును చాటిచెప్పేందుకు బహుజన బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నామని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గౌరవ అధ్యక్షురాలు విమలక్క అన్నారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని ఊట్కూరు గ్రామంలో అరుణోదయ సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి బహుజన బతుకమ్మ వేడుకలు జరిగాయి. ఈ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై స్థానిక మహిళలతో కలిసి బతుకమ్మ ఆటలాడి పాటలు పాడారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ.. బహుజన బతుక్మ అంటే పూలకవాతు, స్త్రీలకవాతు అని చాటిచెప్పాల్సిన అవసరం ఉందన్నారు. అత్యాచారాలను ప్రతిఘటించడం, ఆత్మగౌరవంతో జీవించడం మహిళల హక్కు అన్నారు. మహిళలపై జరుగుతున్న అత్యాచార సంఘటనలపై విచారణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి ఫాస్ట్ ట్రాక్ కోర్టులను పెంచాలన్నారు. గత 15 సంవత్సరాలుగా వివిధ అంశాలపై పోరాడుతున్న బహుజన బతుకమ్మ ఈసారి స్త్రీలపై లైంగిక అత్యాచారాలకు నిరసనగా 'గుండెలు బాదుకోవమ్మా.. గుత్పలు అందుకోవమ్మా..' అంటూ పిలుపును ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అరుణోదయ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్సూర్, రాష్ట్ర నాయకులు ప్రభాకర్, రమేశ్, రాకేశ్, సుధాకర్, అనిత, రాజేశ్వరి, చెరుకు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● దేవి ఉగ్రరూపం



దేవీ శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా నల్లగొండలోని రాక్‌హిల్స్ కాలనీలో అమ్మవారి నృత్య రూపకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారిణి పుష్ప

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

నల్లగొండ : డీఎస్సీ–2024 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన శుక్రవారం కొనసాగింది. ఈ నెల 2వ తేదీ నుంచి ఉదయం 9 గంటల నుంచి రాత్రి వరకు ఎస్‌జీటీలతో పాటు స్కూల్ అసిస్టెంట్లు, లాంగ్వేజి పండిట్, పీఈటీలకు సంబంధించిన సర్టిఫికెట్ల పరిశీలన చేపడుతున్నారు. మొత్తం 1,525 మంది అభ్యర్థులను సర్టిఫికెట్ల పరిశీలనకు పిలువగా ఈ నెల 2న 212 మంది, 3వ తేదీన 548 మంది, 4వ తేదీన ఉదయం 198 మంది, సాయంత్రం వేళ 207 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన చేశారు. ఈ మూడు రోజుల్లో కలిపి 1,165 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేశారు. ఇంకా 360 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించాల్సి ఉంది. అయితే ఈ సర్టిపికెట్ల పరిశీలన కార్యక్రమాన్ని కలెక్టర్ నారాయణరెడ్డి పరిశీలించారు. పకడ్బందీగా సరిఫికెట్ల వెరిఫికేషన్ చేయాలని సూచించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు డీఈఓ భిక్షపతి అక్కడే ఉండి పరిశీలన జరిగేలా పర్యవేక్షించారు.

ఎల్ఐసీని నిర్వీర్యం చేయొద్దు

- ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మంజునాథ్
- నల్లగొండలో రాష్ట్ర శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న మంజునాథ్

రామగిరి(నల్లగొండ) : ఎల్ఐసీ సంస్థను నిర్వీర్యం చేసే కుట్రను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, సౌత్ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు ఎల్.మంజునాథ్ అన్నారు. శుక్రవారం నల్లగొండలో నిర్వహించిన రాష్ట్రస్థాయి శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పాత పాలసీల స్థానంలో అక్టోబర్ 1 నుంచి దేశ వ్యాప్తంగా కొత్త పాలసీలను ప్రవేశపెట్టిందన్నారు. ఎల్ఐసీకి వెన్నెముకగా ఉన్న 14 లక్షల మంది ఏజెంట్లకు కమీషన్ పెంచకుండా తగ్గించడంతో ఏజెంట్లకు నష్టం వాటిల్లుతుందన్నారు. సమావేశం అనంతరం క్లాక్‌టవర్ సెంటర్‌లో ఏజెంట్లు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సౌత్ జోన్ కార్యదర్శి పిఎల్. నరసింహారావు, రాష్ట్ర కార్యదర్శి తన్నీరు కుమార్, సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షుడు నలప రాజు సైదులు, ప్రజ్ఞాపురం శివశంకర్, మైనంపాటి అరుణ, సుంకి దేవేందర్, కమ్మంపాటి సైదులు, కవిత, మహేశ్వరి, నాగమణి, దారం వెంకన్న, షణ్ముకచారి, వెంకట్‌రెడ్డి, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుపై అనాసక్తి

- కొత్త పంట కావడంతో రైతుల్లో అవగాహన లేమి
- దిగుబడి, మార్కెటింగ్‌పై కనిపించని భరోసా
- క్షేత్రస్థాయిలో లభించని సలహాలు, సూచనలు
- నెరవేరని ప్రభుత్వ లక్ష్యం



నల్లగొండ మండలం చందనపల్లిలో సాగులో ఉన్న ఆయిల్‌పాం తోట

నల్లగొండ రూరల్ : ఆయిల్‌పాం సాగుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. కొత్త పంట కావడం, రైతులకు క్షేత్రస్థాయిలో సలహాలు ఇచ్చే సిబ్బంది లేకపోవడంతో రైతులు వెనుకడుగు వేస్తున్నారు. నీటి వసతి ఉన్న రైతులంతా వరి, మెట్ట రైతులు మొత్తం పత్తి వేసేందుకే మొగ్గు చూపుతున్నారు.

అయిల్ పాం సాగుచేస్తే తక్కువ పెట్టుబడితో పాటు ఎక్కువ లాభం వస్తుందని ప్రభుత్వం ఉద్యానవన శాఖ ద్వారా ప్రచారం కల్పించింది. నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో సాగు చేపట్టేందుకు ఒక ప్రైవేట్ కంపెనీ టెండర్ దక్కించుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో మాత్రం ఆయిల్‌ఫుడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సాగు చేపడుతున్నారు. ఇక్కడ రైతులకు మార్కెటింగ్, సాంకేతిక సలహాలు ఇచ్చి భరోసా కల్పిస్తోంది. దీంతో యాదాద్రి జిల్లాలో ప్రభుత్వం 3,550 ఎకరాలు టార్గెట్ ఇవ్వగా 2500 ఎకరాల్లో ఇప్పటికే మొక్కలు నాటారు. మరో 850 ఎకరాల్లో మొక్కలు నాటేందుకు రైతులను గుర్తించారు. కానీ ప్రైవేట్ సంస్థ టెండర్ దక్కించుకున్న నల్లగొండ, సూర్యాపేటలో మాత్రం రైతులు సాగుకు ముందుకు రావడం లేదు.

25 ఏళ్ల వరకు దిగుబడి

ఆయిల్‌పాం సాగు చేయాలనుకునే రైతులు మొక్కకు రైతు వాటాగా రూ.20 చొప్పున చెల్లించాలి. రెండున్నర ఎకరాలకు 143 మొక్కలు నాటాలి. ఒక మొక్కకు రోజుకు 200 లీటర్ల నీరు అవసరం. నాలుగేళ్ల తర్వాత దిగుబడి ప్రారంభమవుతుంది. మొక్కలు సరఫరా చేసిన కంపెనీనే రైతుల దగ్గర నుంచి దిగుబడి కొనుగోలు చేస్తుంది. 25 ఏళ్ల వరకు ఆయిల్‌పాం గెలలు దిగుబడి ఇస్తాయి. అంతర్జాతీయ క్రూడాయిల్ ధరను బట్టి ప్రతి నెలా ఆయిల్‌పాం గెలకు టన్ను ధరను కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తుంది. టన్ను ధర కనీసం రూ.20 వేల నుంచి రూ.25 వేలు ఉంటే రైతుకు ఈ తోటలు గిట్టుబాటు అవుతాయి.

అవగాహన కల్పించే సిబ్బంది కరువు

ఆయిల్‌పాం సాగు జిల్లాలో రైతులకు కొత్త పంట. గతంలో సాగు చేసిన అనుభవం లేదు. సాంకేతికంగా రైతులకు క్షేత్రస్థాయిలో సాగు మెళకువలు, సస్య రక్షణ చర్యలను చెప్పేందుకు సాంకేతిక సిబ్బంది లేరు. జిల్లాలో బత్తాయి, వరి, పత్తి సాగు చేసిన అనుభవం ఉన్న రైతులకు ఆయిల్‌పాంపై పెద్దగా అనుభవం లేదు. ఆయిల్‌పాం తోటలకు మొగి పురుగు బెడద ఇతర రోగాలు వస్తుంటాయి. చెట్ల మధ్యలో పరపరాగ సంపర్కం కోసం కొన్ని మొక్కలు నాటాల్సి ఉంటుంది. మార్కెటింగ్ పైన అవగాహన లేదు. ప్రైవేట్ కంపెనీ టెండర్ తీసుకోవడంతో రైతులకు భరోసా కలుగడం లేదు. దిగుబడి కోసం నాలుగేళ్ల పాటు ఎదురు చూడటం వృథా అని నీరు ఉన్నరైతులంతా వరి సాగు వైపే మొగ్గు చూపుతున్నారు. మరోవైపు వరి, పత్తి, పప్పు ధాన్యాలు, పొద్దు తిరుగుడు లాంటి పంటలకు సాంకేతిక సలహాలు ఇచ్చేందుకు ఐదు వేల ఎకరాలకు ఒక ఏఈఓ ఉండగా ఉద్యాన శాఖలో 5, 6 మండలాలకు కలిపి ఒక ఉద్యాన అధికారి లేరు. ఉన్న ఉద్యాన అధికారులు ఆయా మండలాల్లో సాగవుతున్న బత్తాయి, మామిడి, జామ, మిర్చి, బొప్పాయి, కొబ్బరి, సపోట, సీతాఫలం, అల్లం, క్యారెట్, తదితర పండ్లు, కూరగాయల సాగు మెళకువలు అందించాల్సి ఉండడంతో ఆయిల్‌పాం సాగుపై సలహాలిచ్చే సిబ్బంది లేరు. సాగు టెండర్ దక్కించుకున్న కంపెనీ కూడా రైతులకు అవగాహన కల్పించడం నామమాత్రంగానే కనిపిస్తోంది. దీంతో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం నెరవేరడం లేదు.



ఉమ్మడి జిల్లాలో ఆయిల్‌పాం సాగు (ఎకరాల్లో).

జిల్లా	లక్ష్యం	సాగు
యాదాద్రి	3,550	2,500
నల్లగొండ	5,000	2,143
సూర్యాపేట	2,500	700

పెరిగిన సాగు ఖర్చులు..

కూలీల ఖర్చులు, ఎరువుల ధర, పురుగు మందుల పిచికారి దున్నకం తదితర ఖర్చులు భారీగా పెరిగాయి. ప్రస్తుతం సాగు చేసిన రైతుల తోటల్లో గెలలను కలెక్షన్ సెంటర్‌కు తీసుకుపోవడం రవాణ భారంగా మారుతోంది. ఫ్యాక్టరీ అందుబాటులో ఉంటే రైతుకు ఆ భారం తగ్గడంతో పాటు భరోసా కలిగి సాగు వైపు ఆసక్తి చూపే అవకాశం ఉంది.

గిట్టుబాటు ధర అందించాలి



20 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేస్తున్న. ఏడెకరాల్లో దిగుబడి వస్తోంది. ఎకరాకు రూ.లక్ష ఆదాయం వస్తుందని ప్రభుత్వం ప్రచారం కల్పించింది. కానీ ఆశించిన స్థాయిలో ఆదాయం రాకపోగా సాగు భారంగా మారింది. ఆయిల్‌పాం టన్ను ధర రూ.20 వేల నుంచి రూ.25 వేలకు పెంచితేనే గిట్టుబాటు అవుతుంది.

– జగన్‌మోహన్‌రావు, ఆయిల్‌పాం రైతు, మారేపల్లి

సాగును ప్రోత్సహిస్తున్నాం



జిల్లాలో ఆయిల్‌పాం సాగును ప్రోత్సహిస్తున్నాం. రైతుల్లో అవగాహన కల్పించేందుకు కంపెనీ వారితో కలిసి సమావేశాలు నిర్వహిస్తున్నాం. అవసరమైన సాంకేతిక సలహాలను అందిస్తున్నాం. ఫ్యాక్టరీ ఏర్పాటుకు స్థల పరిశీలన జరుగుతుంది. ప్రభుత్వం నిర్దేశించిన సాగు లక్ష్యాన్ని పూర్తి చేస్తాం. ఆయిల్‌పాం మొక్కలు సిద్ధంగా ఉన్నాయి.

– సాయిబాబా, జిల్లా ఉద్యాన అధికారి

క్లుప్తంగా

చికిత్స పొందుతున్న యువకుడు మృతి


సాయికుమార్ (ఫైల్)

అర్వపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జాజిరెడ్డిగూడెం మండలం కొమ్మాల గ్రామ పంచాయతీ ఆవాసం మర్రిబావితండాకు చెందిన భూక్యా శారద కుమారుడు సాయికుమార్(24) కుటుంబ సభ్యులతో కలిసి వారం రోజుల కిందట జాన్ పహాడ్ దర్గాకు ట్రాక్టర్‌లో వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. అక్కడే ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. కాగా.. మృతుడు అవివాహితుడు. నిరుపేద కుటుంబం కావడంతో తండావాసులు, స్నేహితులు విరాళాలు వేసుకొని సాయికుమార్‌కు అంత్యక్రియలు నిర్వహించారు.

బైక్ చోరీ కేసులో ఏడు నెలల జైలు

త్రిపురారం: బైక్ చోరీ చేసిన కేసులో వ్యక్తికి నిడమనూరు సివిల్ కోర్టు జడ్జి బీఎస్ఎన్ సమబాల ఏడు నెలల జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధించారు. తిరుమలగిరి మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన మేడం ప్రతాప్ గత జనవరి 18న పెద్దవూర మండలం లింగంపల్లి గ్రామంలోని తన అత్త గారింటికి బైక్‌పై వెళ్లాడు. ఉదయం లేచి చూసేసరికి బైక్ కనిపించలేదు. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాస్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా నర్సంపేట మండలంలోని సంజీవయ్య కాలనీకి చెందిన కత్తి రవి కుమార్ బైక్ దొంగిలించినట్లు పోలీసులు గుర్తించడంతో అతడిని శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. అతడు నేరం ఒప్పుకోవడంతో ఏడు నెలల జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధించారు. కార్యక్రమంలో పీసీ రవి కుమార్, పీపీ సాధన, లైజన్ ఆఫీసర్ అలీ అహ్మద్ పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

- రూ.10,200 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలో పేకాట స్థావరంపై పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ఐదుగురిని అరెస్ట్ చేయగా ముగ్గురు పరారయ్యారు. పట్టణ సీఐ రాము తెలిపిన వివరాల ప్రకారం... కోదాడ పట్టణంలోని సూర్యాపేట రోడ్డులో గల రాజ్యలక్ష్మి సీడ్స్ షాప్ పైఅంతస్తులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు ఎస్ఐ రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఈమేరకు బాణోతు రూప్లా, చింతల నాగేశ్వరరావు, బాణోతు బాలు, పాయిలి వెంకటేశ్వర్లు, బాణోతు వీరన్నలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.10,200 నగదు, మూడు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల రాకను పసిగట్టిన మరో ముగ్గురు నరసింహారావు, విజయ్, ఇంటి యజమాని ముక్కా వేణులు పరారయ్యారు. ఈ ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

లైంగిక వేధింపుల కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

భువనగిరి క్రైం: మహిళా వైద్యులను లైంగికంగా వేధించిన కేసులో నిందితుడికి మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ నల్లగొండలోని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి రోజారమణి తీర్పునిచ్చారు. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ దురిశెట్టి కాళిదాసాచారి 2017లో భువనగిరి ఏరియా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తూ తోటి ఉద్యోగులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. దీంతో వారు భువనగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని 2018లో నల్లగొండలోని ఎస్సీ, ఎస్టీ కోర్టుకు రిమాండ్ చేయగా శుక్రవారం విచారణ జరిపారు. దోషిగా నిర్ధారణ కావడంతో నిందితుడికి మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

శుభకార్యానికి వెళ్లి వస్తుండగా..

- అదుపుతప్పి కారు బోల్తా
- ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు
- అడివెంల సమీపంలో ఘటన


రాములు (ఫైల్)


రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు


వివరాలు తెలుసుకుంటున్న సూర్యాపేట కలెక్టర్ నందలాల్ పవార్

అర్వపల్లి: బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి వెళ్లి వస్తుండగా కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా.. ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం సూర్యాపేట– జనగామ 365 జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. నూతనకల్ మండలం పెదనెమిల గ్రామానికి చెందిన రేసు రాములు(49) కుటుంబం కొంత కాలంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో నివాసం ఉంటుంది. శుక్రవారం తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో జరిగే తమ బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి భార్య అంజమ్మ, మనుమరాలు వంశికతో కలిసి కారులో వెళ్లారు. తిరిగి సాయంత్రం సూర్యాపేటకు బయలుదేరగా.. జాజిరెడ్డిగూడెం మండలం అడివెంల సమీపంలో కారు అదుపుతప్పి రోడ్డు కల్వర్టును ఢీకొని బోల్తా పడింది. దీంతో కారు నుజ్జునుజ్జయి డోర్లు మూసుకుపోయాయి. స్థానికులు కారు మెకానిక్‌ను పిలిపించి కారు డోర్లు తీయించి, అందులోని ముగ్గురిని అతికష్టం బయటకు బయటకు తీశారు. అప్పటికే రాములు మృతిచెందగా.. భార్య అంజమ్మ, మనుమరాలు వంశికకు గాయాలయ్యాయి. వీరిని సూర్యాపేట జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు కాగా ఇద్దరి పెళ్లిళ్లు అయ్యాయి. చిన్న కుమార్తెను ఇటీవల ఉన్నత చదువుల కోసం లండన్ పంపించారు. సంఘటనా స్థలికి అర్వపల్లి పోలీసులు చేరుకొని ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రానికి వెళ్లి వస్తూ ఇదే మార్గంలో సూర్యాపేటకు వెళ్తున్న కలెక్టర్ నందలాల్ పవార్ సంఘటనా స్థలంలో ఆగి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు.

ఆటోను ఢీకొట్టిన కారు

- ఆటో డ్రైవర్ మృతి, మరొకరికి గాయాలు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో


మృతుడు నర్సింహ

చౌటుప్పల్ రూరల్: ఆటోను కారు ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన చౌటుప్పల్ మండలంలోని ఎల్లగిరి క్రాస్‌రోడ్డు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల పట్టణ కేంద్రానికి చెందిన మట్టిపల్లి నర్సింహ(46), బర్ల లక్ష్మమ్మలు పండ్లు కొనుగోలు చేసేందుకు రంగారెడ్డి జిల్లా కొత్తగూడెంలోని పండ్ల మార్కెట్‌కు చిట్యాల నుంచి ఆటోలో వెళ్తున్నారు. చౌటుప్పల్ మండలంలోని ఎల్లగిరి క్రాస్ రోడ్డు వద్ద కారు వేగంగా వచ్చి ఆటోను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ నర్సింహ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో వెనక కూర్చున్న బర్ల లక్ష్మమ్మ తీవ్రంగా గాయపడడంతో చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జయింది. కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మధకుమార్ తెలిపారు.

లారీ ఢీకొట్టి వ్యక్తి దుర్మరణం


శివరాం నాయక్ (ఫైల్)

పాలకవీడు: బైక్‌ను లారీ ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన పాలకవీడు మండల పరిధిలోని కల్మేట్‌తండా వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్మేట్‌తండాకు చెందిన ధీరావత్ శివరాంనాయక్(68) వ్యవసాయం చేసుకుంటూనే, రంగస్థల కళాకారుడిగా నాటకాలు వేసేవాడు. రోజూ మాదిరిగా వ్యవసాయ పనుల నిమిత్తం దామరచర్ల వద్ద తన పొలానికి వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. మార్గమధ్యంలో లారీ ఎదురుగా వచ్చి ఇతని బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి పెద్ద కుమారుడు ధీరావత్ ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మీనర్సయ్య తెలిపారు.

మద్యం మత్తులో డ్రెయినేజీ కాల్వలో పడి మృతి


శ్రీనివాస్ (ఫైల్)

భువనగిరి క్రైం: మూత్ర విసర్జనకు వెళ్లిన ఓ వ్యక్తి మద్యం మత్తులో డ్రెయినేజీ కాల్వలో పడి మృతిచెందాడు. ఈ సంఘటన శుక్రవారం భువనగిరి పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని పోచమ్మవాడకు చెందిన గడ్డమీది శ్రీనివాస్(36) డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. గురువారం రాత్రి శ్రీనివాస్ మద్యం సేవించి మూత్ర విసర్జనకు పక్కనే ఉన్న డ్రెయినేజీ కాల్వ వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు అందులో పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఉదయం పారిశుద్ధ్య కార్మికులు వచ్చి చూడగా శ్రీనివాస్ మోరిలో పడి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూసేసరికి అతను మృతిచెంది ఉన్నాడు. మృతుడి తల్లి అహల్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై లక్ష్మీనారాయణ తెలిపారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి



మృతుడు వెంకటయ్య

మోత్కూర్: బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన మోత్కూర్ మండలం అనాజీపురం గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొండాపురానికి చెందిన మన్నె వెంకటయ్య (60) నార్కట్‌పల్లి మండలం నక్కలపల్లి గ్రామంలో తన చెల్లి సువర్ణ ఇంటికి సాయంత్రం బైక్‌పై వెళ్లి తిరిగి కొండాపురం వస్తున్నాడు. ఈక్రమంలో అనాజీపురం చెరువుకట్ట వద్ద బైక్ ఒక్కసారిగా అదుపుతప్పి కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి పోలీసులు, బంధువులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మృతుడి కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేటకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

ప్రేమించి మోసం చేసిన వ్యక్తికి పదేళ్ల జైలు

రామగిరి(నల్లగొండ): యువతిని ప్రేమించి మోసం చేసిన వ్యక్తికి 10 సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి రోజారమణి శుక్రవారం తీర్పునిచ్చారు. మాడుగులపల్లి మండలం అబంగాపురం గ్రామానికి చెందిన కడియం సుధాకర్ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమిస్తున్నానని వెంట పడ్డాడు. మాయ మాటలు చెప్పి శారీరకంగా లోబర్చుకున్నాడు. దీంతో యువతి గర్భం దాల్చింది. ఇంట్లో తెలియడంతో వివాహం చేసుకోవాలని కోరగా.. తనకు సంబంధం లేదని చెప్పాడు. మోసపోయిన యువతి 2016లో త్రిపురారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు విచారణ నిమిత్తం పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో శుక్రవారం హాజరుపరిచారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అఖిల వాదనలతో ఏకీభవించిన జడ్జి నిందితుడికి 10 సంవత్సరాలు జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. సీఐ రామ్‌గోపాల్, ఎస్సై ప్రసాద్, కానిస్టేబుళ్లు విచారణకు సహకరించారు.

మూడు గేట్ల ద్వారా మూసీ నీటి విడుదల


గేట్లు ఎత్తడంతో దిగువకు విడుదలవుతున్న నీరు

కేతేపల్లి : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షానికి మూసీ ప్రాజెక్ట్‌కు 2,911ఇన్‌ఫ్లో వస్తుంది. దీంతో అధికారులు శుక్రవారం ప్రాజెక్టు మూడు గేట్లను పైకెత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. 645అడుగుల గరిష్ట నీటిమట్టం గల మూసీ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 643.80అడుగుల వద్దకు చేరుకుంది. ప్రాజెక్టులో నీటిమట్టం గరిష్టస్థాయికి చేరడంతో అధికారులు ప్రాజెక్టు మూడు క్రస్టు గేట్లను రెండు అడుగుల మేర పైకెత్తి 3,520 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు కుడి ప్రధాన కాల్వకు 313.56 క్యూసెక్కులు, ఎడమ ప్రధాన కాల్వకు 241.20 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మూసీ రిర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 4.46టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.15టీఎంసీల నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు ఏఈ ఉదయ్‌కుమార్ తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మంగళపల్లి విద్యార్థులు


వెంకటేశ్వర్లు అనిల్ సాయికుమార్


లోకేష్ సంజయ్

నకిరేకల్ : నకిరేకల్ మండలంలోని మంగళపల్లి జెడ్పీహైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు జి.వెంకటేశ్వర్లు, ఎం.అనిల్, కె.సాయికుమార్, పి.లోకేష్, కె.సంజయ్ రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం కక్ర వీరారెడ్డి, పీడీ చైతన్యకుమార్ శుక్రవారం తెలిపారు. ఈనెల 1న యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్–17 బాలబాలికల హ్యాండ్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 3నుంచి 5వరకు నారాయణపేట జిల్లా కోస్గిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరుగుతున్న 68వ తెలంగాణ రాష్ట్ర స్థాయి చాంపియన్ షిప్‌లో పాల్గొన్నట్లు వెల్లడించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు లగిశెట్టి సత్యనారాయణ, అనిల్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, సౌజాత, కృష్ణవేణి, రాజేందర్, దామోదర్ తదితరులు అభినందించారు.

రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలి

నేరేడుచర్ల (గరిడేపల్లి) : రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలని కేవీకే వ్యవసాయ శాస్త్రవేత్త ఎ.కిరణ్ అన్నారు. శుక్రవారం గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లిలో గల కేవీకేలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ సూత్రాలు, నేలను ఎల్లప్పుడు పంటలతో కప్పి ఉంచడం, పంట వైవిధ్యం, తక్కువ దున్నడం, వ్యవసాయంలో పశువుల అనుసంధానం చేయడం, భూసారాన్ని పెంపొందించడం కోసం ఉపయోగించే జనుము, జీలుగు, పచ్చిరొట్ట ఎరువులు, జీవన ఎరువుల ద్వారా విత్తనశుద్ధి, జీవన ఎరువులు తదితర అంశాలపై వివరించారు. అనంతరం ఉద్యానవన శాస్త్రవేత్త నరేష్ మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పెరటి తోటలు, కూరగాయలు, పండ్లు తోటల పెంపకం తదితర విషయాలపై వివరించారు.

గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు


అమ్మవారికి కుంకుమార్చన పూజ నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో శ్రీదేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండవ రోజైన శుక్రవారం అమ్మవారిని గాయత్రీ దేవిగా అలంకరించారు. అనంతరం ప్రాతఃకాల పూజలో భాగంగా శ్రీలలితా అష్టోత్తర శత నామార్చనలు, సప్తశతీ పారాయణం నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి త్రిశతీ దేవి ఖడ్గమాల నామావళి, లక్ష కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం తీర్థ ప్రసాదం వితరణ జరిపించారు.

ఎంపీటీసీ నుంచి స్కూల్ టీచర్‌గా..

- మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన ముకుందాపురానికి చెందిన ఇందిర


నూకమళ్ల ఇందిర

మునగాల: మునగాల మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన నూకమళ్ల ఇందిర ఏకకాలంలో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. ఈమె భర్త నూకమళ్ల రామకృష్ణ. వీరికి ఇద్దరు కుమార్తెలు. 2019లో బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎంపీటీసీగా గెలుపొంది గ్రామాభివృద్ధిలో భాగస్వామురాలు అయింది. ఓ వైపు వైవాహిక జీవితం, మరోవైపు రాజకీయ జీవితం కొనసాగిస్తూ నిరంతరం, పట్టుదలతో చదివి ఉద్యోగాల సాధనకు వేట కొనసాగించింది. కొద్ది రోజుల క్రితం గురుకుల పాఠశాల ఉపాధ్యాయురాలు ఉద్యోగం పొందింది. ప్రస్తుతం అనంతగిరి మండలంలో విధులు నిర్వహిస్తోంది. అంతేకాకుండా హాస్టల్ వెల్ఫేర్‌లో జాబ్ సాధించింది. ఇటీవల వెలువడిన ఫలితాల్లో ఎస్‌జీటీ పోస్టుకు ఎంపికైంది. తాను మూడు ఉద్యోగాలు సాధించడంలో తన భర్త కృషి ఎంతగానో ఉందని ఇందిర పేర్కొన్నారు.

రజిత మృతి కేసులో వీడుతున్న మిస్టరీ

- హత్యకు గురైనట్లు ప్రాథమిక విచారణలో నిర్ధారణకు వచ్చిన పోలీసులు

గుర్రంపోడు: గుర్రంపోడు మండలం ముల్కలపల్లి గ్రామానికి చెందిన రజిత గత నెలలో ఆత్మహత్యకు పాల్పడిన కేసు కీలక మలుపు తిరిగింది. హత్యకు గురైనట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించిన సమాచారం త్వరలో అధికారికంగా వెల్లడించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కేసు ఏఎస్పీ రాములు నాయక్ నేతృత్వంలో ఉన్నత స్థాయి విచారణ జరుగుతోంది. ప్రధాన నిందితుడు రాములు, అతడి భార్యతోపాటు సహకరించిన మరొకరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు ప్రాథమిక విచారణలో హత్యగానే నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. ప్రధాన నిందితుడు మృతురాలి కుటుంబానికి రూ.30 లక్షలు ఇచ్చేందుకు అంగీకరించిన విషయం బయటపడడంతో మృతురాలు హత్యకాబడినట్లుగా అనుమానం మరింత బలపడింది. ఈ కేసులో హత్యకు దారితీసిన కారణాలపై పోలీసులు లోతుగా విచారణ చేసిన అనంతరం కేసు వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.

టిప్పర్ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం ఘటనపై సమగ్ర విచారణ చేస్తాం

- సూర్యాపేట జిల్లా అదనపు ఎస్పీ నాగేశ్వరరావు

సూర్యాపేట టౌన్: తిరుమలగిరి మండలం తొండ గ్రామంలోని బాలాజీ క్రషర్ మిల్లులో పని చేస్తున్న శాలిగౌరారం మండలం ఆకారం గ్రామానికి చెందిన నాగరాజు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై విచారణ చేస్తామని సూర్యాపేట జిల్లా అదనపు ఎస్పీ నాగేశ్వరరావు తెలిపారు. నాగరాజు డీజిల్ దొంగతనానికి పాల్పడ్డాడనే ఫిర్యాదుపై నాగరాజును, అతనితో ఉన్న మరో నలుగురు వ్యక్తులను తిరుమలగిరి ఎస్ఐ గురువారం పోలీస్ స్టేషన్‌కు పిలిచాడని, డీజిల్ తీసినట్లు నిందితులు ఒప్పుకున్నారని అదనపు ఎస్పీ పేర్కొన్నారు. నిందితులతో సహా వచ్చిన పెద్దమనుషులు ఈ ఫిర్యాదు విషయమై క్రషర్ యజమానితో మాట్లాడుకుంటామని, మరుసటిరోజు పోలీసు స్టేషన్‌కు వస్తామని తెలిపి పెద్దమనుషుల పూచీకత్తుపై పోలీసు స్టేషన్ నుంచి వెళ్లారు. ఈ విషయంలో నాగరాజు మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయమై సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. ఈ ఘటన విచారకరమని అదనపు ఎస్పీ పేర్కొన్నారు. తిరుమలగిరి ఎస్ఐ సురేష్ కొట్టాడు అని నాగరాజు చేసిన అభియోగంపై సమగ్ర విచారణ జరుపుతామని, ఎస్ఐ కొట్టినట్లు రుజువైతే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని అదనపు ఎస్పీ తెలిపారు.

భార్యను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యత్నం

అడ్డగూడూరు: భార్యను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యత్నించిన ఘటన అడ్డగూడూరు మండలంలోని డి.రేపాక గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోనుగ కృష్ణారెడ్డికి, బోనగ స్వరూప(50)కు 30 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కృష్ణారెడ్డి మద్యానికి బానిసై భార్యను చిత్రహింసలకు గురి చేస్తుండేవాడు. ఈ క్రమంలో ఇంటి నుంచి బయటకి వెళ్లి మద్యం సేవించి తిరిగి ఇంటికి చేరుకుని తన భార్యతో గొడవ పడ్డాడు. అనంతరం స్వరూప మెడకు చీర బిగించి భర్త హత్య చేశాడు. నేరం నుంచి తప్పించుకునేందుకు చీరతో ఉరి వేసుకుందని చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. అయితే స్వరూప చీర సగం చినిగి ఉండడం, మెడ భాగంలో కమిలి ఉండడంతో అనుమానం వచ్చిన ఆమె తండ్రి రాజీరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు భర్తను ప్రశ్నించగా.. తానే హత్య చేసినట్లు అంగీకరించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం ఆత్మకూర్ మండల పరిధిలోని ఏనుబాముల స్టేజి సమీపంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా నూతనకల్ మండలం ఎడవెల్లి గ్రామానికి చెందిన మన్నె రమేష్ ఆటోలో నాలుగున్నర క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సూర్యాపేటకు తరలిస్తుండగా పట్టుకున్నారు. దీంతో ఆటోను సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ శంకర్ నాయక్ తెలిపారు.

నడిగూడెం మండలంలో ఆరు క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

నడిగూడెం: మండల పరిధిలోని సిరిపురం నుంచి శ్రీరంగాపురం వెళ్లే దారిలో శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడినట్లు ఎస్ఐ అజయ్ కుమార్ తెలిపారు. ఈమేరకు ఆటో డ్రైవర్ కాశీంను ప్రశ్నించగా శ్రీరంగాపురం సమీపంలో ఉన్న వెంకటేశ్వరరావు కోళ్ల ఫారానికి తరలిస్తున్నట్లు చెప్పడంతో వెంకటేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. పట్టుకున్న రేషన్ బియ్యాన్ని డీటీ సీఎస్ రమణారెడ్డికి అప్పగించినట్లు చెప్పారు.

పోలీస్, ఎక్సైజ్ అధికారుల దాడులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం): చింతలపాలెం మండలంలోని యర్రకుంట తండాలో శుక్రవారం పోలీసు, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా దాడి చేసి 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకోగా.. 150 లీటర్ల బెల్లం పానకం పారబోసి ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. యర్రకుంటతండాలో పోలీసు, ఎక్సైజ్ అధికారులు ఉమ్మడిగా దాడి చేసి భూక్యా వీరన్న వద్ద ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు. సారా తయారీకి ఉపయోగించే సుమారు 150 లీటర్లు బెల్లం పానకం పారబోసినట్లు చెప్పారు. ఈమేరకు అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ దివ్య తదితరులు పాల్గొన్నారు.

బెల్లం పానకం ధ్వంసం

మద్దిరాల: అక్రమంగా నిల్వ చేసిన బెల్లం పానకాన్ని పోలీసు, ఎక్సైజ్ అధికారులు దాడి చేసి ధ్వంసం చేశారు. ఈ సంఘటన మద్దిరాల మండల పరిధిలోని గోరెంట్ల, మామిండ్లమడవ ఆవాస దరావత్ తండాలో శుక్రవారం చోటుచేసుకుంది. తుంగతుర్తి సీఐ శ్రీనివాస్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సారా విక్రయిస్తున్నారని సమాచారం మేరకు గోరెంట్ల, మామిండ్లమడవ ఆవాస దరావత్ తండాలో పోలీసు, ఎక్సైజ్ అధికారులతో కలిసి దాడి చేసినట్లు చెప్పారు. పలువురు అక్రమంగా నిల్వ చేసిన బెల్లం పానకంతోపాటు సారాను పట్టుకుని ధ్వంసం చేసి, వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు. గోరెంట్ల గ్రామానికి చెందిన బానోతు హేమ్లా, మామిండ్ల మడవ ఆవాస దరావత్ తండాకు చెందిన దరావత్ భద్రమ్మ, దరావత్ దస్రూలను తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేసినట్లు చెప్పారు.

వరిలో జాగ్రత్తలు పాటించాలి

- వరి సాగులో మెళకువలపై మండల వ్యవసాయాధికారి సూచనలు


చిరుపొట్ట దశలో ఉన్న వరి

నడిగూడెం: ప్రస్తుతం వరి చేలు పొట్ట, చిరుపొట్ట దశలో ఉన్నాయి. ఈ సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని నడిగూడెం మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి దేవ ప్రసాద్ పేర్కొంటున్నారు. వరిసాగులో పాటించాల్సిన మెళకువలపై ఆయన సలహాలు సూచనలు.. వరికి మోతాదుకు మించి యూరియా వేస్తే అనేక తెగుళ్లు వ్యాపిస్తాయి. వరి పంటకు చిరుపొట్ట దశలో ఎకరానికి 40 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ కలిపి వేయాలి. పంటకు నీరు అధికంగా పెట్టాలి. పొట్ట దశలో వరి పంటకు ప్రధానంగా అగ్గితెగులు, పాముపొడ తెగులు, దోమపోటు లాంటి తెగుళ్లు అధికంగా వ్యాపిస్తాయి. సన్న రకం ధాన్యం పంటలో ఈ తెగుళ్లు అధికంగా వ్యాపిస్తాయి. వరి కక్ర మొదట్లో చిన్న చిన్న పురుగు నీటిమట్టం పైకి పాకుతుంటాయి. ఈ పురుగుల నివారణకు ఎకరానికి 350 మి.లీ. బ్రప్రోజిన్ పిచికారీ చేయాలి. పాము పొడ తెగులు, అగ్గి తెగులు మోతాదుకు మంచి యూరియా వేయడం వల్ల వ్యాపిస్తాయి. వరి పంట ఆకుపై ఇటుక పొడి రంగులో నూలు కండె ఆకారపు మచ్చలు ఏర్పడితే అగ్గితెగులుగా గుర్తించాలి. దీని నివారణకు ట్రైసైక్లోజోల్ 120 గ్రాములు ఒక ఎకరానికి పిచికారీ చేయాలి. కాండం మీద నల్లటి మచ్చలు ఏర్పడితే పాముపొడ తెగులుగా గుర్తించాలి. దీని నివారణకు హెక్సాకోనాజోల్ 400 మి.లీ. ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. రెండు కలిసి ఉంటే 400 మి.లీ. లీటర్ల టెబుకోనాజోల్ పిచికారీ చేయాలి. గత రబీలో సన్నరకాల్లో మానుపుండు తెగులు అధికంగా వ్యాపించింది. ఇది వస్తే పంట అధికంగా దిగుబడిలో నాణ్యత తగ్గుతుంది. దీని నివారణకు ఎకరానికి 200 మి.లీ. ప్రొపికొనాజోల్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.